కథానిక

# నీతివర్తనకి పశ్చాత్తాపం

"కౌండిన్య"

"ఏంవశా! నే మా వేశిపట్టిన చేపలు వండి పెడితే తింటమేనేంటి నీ మగతనం" అన్నది మంగి, చిరునవ్వుతో గురవాయిని చూస్తూ. పాపం, మాటలు అమాయిక హృదయంలోని ప్రేమపొంగుల్లోనుంచి ప్రియుండి నేవల్ల కలిగే తృప్తివల్ల చనువుగా అన్నమాటలే ఐనప్పటికీ అభిమానంగల గురవాయి పౌరుషం దెబ్బతిన్నది. వెడల్పాటి అతని ఛాతీ రోషంతో పొంగిపోయింది. మంగి చిరునవ్వు మాటలకు చిరునవ్వుతోనే సమాధానం చెప్పినప్పటికీ ఆ మాటలు గుండెల్లో గాలంగా దేవుతున్నై. కాని ఏం చేస్తాడు? అందరికీ ఈ నెల చాలా గడ్డు నెల. ముందు చూపుతో దాచెట్టిన పదిరూపాయలూ మొన్న మాయదారి చిత్తులో పెట్టివేశాడు. ఆరోజునుంచీ కాలుకాలిన పిల్లిలాగా తిరుగుతున్నాడు, ఎక్కడైనా ఉద్యోగమేదైనా దొరుకుతుందేమోనని. అవి అసలు పనిరోజులే కావు. ఎరిగున్న మోతుబరులందర్నీ అడిగి చూశాడు. లాభం లేకపోయింది. ఈ రెండు మూడు రోజుల్నుంచీ మంగే పట్టుకొస్తోంది నూకలూ అవీని, అవి చాలీచాలటం లేదు.

క్రిందటిమారు జైల్లో పడ్డప్పటినుంచీ వెధవ దొంగ వృత్తిమానేసి ఉన్న ఊరువదలి ఇక్కడికి చేరాడు. ఇక్కడికి రావడంతోనే, పాపం, కరణంగారి అండదొరికింది. బాగానే సాగిపోతోంది. ఇప్పుడు వ్యవహారం చిక్కుపడ్డది. ఇలాంటి పరిస్థితుల్లో ఒకటి రెండుసార్లు కరణంగారే ఆదుకొన్నాడు. ఈసారి ఆయనకూడా మొండిచేయి చూపేశాడు. కోర్టు వ్యవహారాల్లో ఇరుక్కోటంవల్ల కరణంగారికే డబ్బుకు ఇరకాటంగా ఉంది. ఇక రెండో ఉపాయం కనిపించలేదు. మళ్లా దొంగతనం చేయాల్సిన అవసరం కలిగింది.

ఆ ఊరంతా తనకు క్రొత్త. ఎవరి అనుపానులూ ఇంకా సరిగా తనకు తెలియవు. ఇక్కడికి వచ్చి సంవత్సరన్నర అయినప్పటికీ, ఇంతవరకూ దొంగబుద్ధే పోలేదు కాబట్టి మరే విషయం పట్టించుకోకుండా కరణంగారి పనిలోనే ఉంటూ కాలక్షేపం చేస్తూ ఉండేవాడు. కరణంగారి ఇంటి వ్యవహారాలన్నీ గురవాయికి అమూలాగ్రంగా కంఠోపాఠం. ఏవస్తు వెక్కడుండేదీ, వాడికి బాగా తెలుసున్న విషయమే. చాలాసార్లు అనుకొంటూ ఉండేవాడు. దొంగలకి వీరిల్లెంత వీలు! అని. యజమాని చాలా బేఫర్వామనిషి. భార్యకు జాగ్రత్త అనేది యేకోశానా లేదు. ఇంట్లో వాళ్లిద్దరే. ఐనా, ఛీ! తిన్నయింటివాసాలు లెక్కబెట్టటమా! గురవాయి హృదయంలో సానుభూతి ఉబికింది. కాని అది రెండుమూడు నిమిషాలకంటె యెక్కువ నిలువలేకపోయింది. అతని అభిమానమే ముందుకు నెట్టుకొనివచ్చింది. ఈ రాత్రి ఏదో సంపాయించుకు రాకపోతే మర్నాడు ప్రొద్దున మంగి మొగంచూట్టం ఎలా? ఇది ఆత్మగౌరవానికి అగ్నిపరీక్ష. పౌరుషానికి సామర్థ్యా. తన్నుతాను సమర్థించుకో ప్రయత్నించాడిక గురవాయి. ఇదివరకు మళ్లే దోపిడీ చేసే ఉద్దేశం లేదు తనకు. ఈ నెల గడిచిపోయేటట్లు చూసి తెస్తాడు. అంతకంటె ముట్టుకొనే బుద్ధి లేదు. ఇది అతని బుర్రలో తరచిచూస్తే దొంగతనంగానే కనిపించలేదు.

పదిపన్నెండు గడియల ప్రొద్దుపోయింది. పౌర్ణమి ముందు పంచమి కావటంవల్ల చంద్రుడు వినుగెత్తి వెళ్లిపోయాడు. చీకటిమాలక్ష్మి జుట్టు విరబోసుకు తాండవిస్తోంది. తుప్పాబట్టిన సాధన సామగ్రిని తీసి గురవాయి బయలుదేరాడు, తన యజమాని ఇల్లు కన్నం వేయటానికి. ఊరంతా మాటు మణిగింది. అక్కడపుడు కుక్క—

రుపులు, కీచురాయి శబ్దమూ తప్ప ఏమీ వినిపించటం లేదు. అలవాటు తప్పిన గురవాయికి అంతా మళ్ళీ క్రొత్తగా ఉంది. అడుగడుక్కీ అనుమానపడుతూ, దడతో కొట్టుకునే గుండె అలికిడికి ఉలిక్కిపడుతూ కరణంగారి ఇల్లు చేరాడు గురవాయి.

ఇంటికి పడమటివైపు ఖాళీ సందు — పగలే జనసంచారం ఉండదు. అందులోనూ ఆ గోడ ఉప్పుచవిటి గోడ. కరణంగారు పడుకుండే గదికికూడా దూరం కావటంవల్ల చప్పుడు వినిపించదు. అదికూడా ఒక ఊసులే. ఇన్ని ఆలోచించినా గురవాయి చేతులు వణికినై. పాత పడిపోయిన పని, పైపెచ్చు కన్న యజమాని ఇల్లు! ముచ్చెమటలు పోసినై. ఒళ్ళంతా తడిసిపోయింది. కాని తప్పని పని... మొదలు పెట్టిన తర్వాత మూడు నిముషాల్లో పడకగది చేరేశాడు గురవాయి. కరణంగారి మంచంక్రింద వెండి సామాను ఉంటుందని గురవాయికి ఇదివరకే తెలుసు. పిల్లి అడుగులేసుకుంటూ మంచందగ్గరవెళ్ళి, కూర్చొని, వంగి, వెండి సామానుపై కప్పిన బట్ట తొలగించాడు. రెండు పెద్ద పళ్ళాలు. రెండు మూడు చిన్నపళ్ళేలు. రెండు గిన్నెలు. కళ్లు జిగేలుమన్నాయి. అందులో పెద్ద గిన్నె తీశాడు, తృప్తిని సూచించే కళ్ళతో మామూలుగా మిగిలిన వాటిపై బట్ట కప్పాడు. ఒక్క నిముషం, తటపటాయించాడు. మళ్ళీ అతనిలోని దొంగ స్వభావం అధికారం వహించసాగింది. చేతికి చిక్కిన ఈ లక్ష్మిని వదులుకోవటమా? ఎంత తెలివితక్కువ పని! డబ్బు దగ్గిర యజమానేంటి, సేవకుడేంటి? అన్నీ తీసుకోవాల్సిందే. తనే మరొక దొంగ అయివుంటే, ఒక్క చిన్నం ఎత్తయినా మిగల్చటానికి పూనుకుంటాడా? మళ్ళా ఒక్కొక్కటిగా తీసి అవి కప్పి ఉంచిన గుడ్డలోనే మూటకట్టాడు. లేచి నిలబడ్డాడు చేతిలోని మూటతో సహా. దొంగకి తన సామర్థ్యం దీనితో పూర్తిగా అర్థమైపోవాలని మనస్సులోని వెర్రికోరిక. పెదవుల చివరల చిరునవ్వు తోచింది గురవాయికి ఆ దుర్గాలో కూడా! మెల్లగా అడుగు వేయసాగాడు బైటికి.

ఏదో అలికిడైంది. గదిముందు ఎవరో నడుస్తున్నట్టు చప్పుడు వినవచ్చింది. ఏమిటో విచారించటం! ఆ పరిస్థితుల్లో ప్రాణానికే ముప్పు అని గురవాయికి తెల్లమే. వెంటనే చేతిలోని మూటను అచ్చటే ఉన్న ట్రంకు పెట్టెపై పెట్టి గోడకు ఏటవాలుగా ఆనించియున్న ఉయ్యాల బల్ల చాటున నక్కి తొంగిచూడ ప్రారంభించాడు.

ఆజానుబాహువైన విగ్రహమొకటి వంగి ముందుకు సాగుతూ, ప్రక్కలు చూచుకొంటూ గదిలో మెల్లిగా ప్రవేశించింది. గిరజాలు, కోర మీసాలూ, బొద్దుగా ఎదిగిన గడ్డమూ సింహంలాగా భయంకరంగా పెంచినై ఆ విగ్రహాన్ని. గురవాయి అంత వాడికీ ఒళ్లు జలదరించింది. నెమ్మదిగా పోల్చుకొన్నాడు గురవాయి. ఆ వచ్చింది పోరుగూరి, ఎరికెల పేరిగాడు. దొంగతనాల్లో ఆరితేరిన ఉద్దండపిండం. వాడి పేరంటే ఆ చుట్టుపట్ల గడగడాట్. ఇంతవరకూ పోలీసులకు పట్టుబడని గజదొంగ! ఎదరబడితే పదిమందికైనా సమాధానం చెబుతాడు. గురవాయికి ఏమీ పాలుబోలేదు. పేరిగాడు కన్నంలోంచే వచ్చాడా? తనను చూచాడా? ఎంత ధైర్యంగా లోపలికి వచ్చాడు! వీడు తలుకొంటే కరణంగారి ఇల్లు గుల్లకాక తీరుతుందా? ఒంటరిగా వచ్చాడా? ఎవరినైనా తెచ్చాడా? ఇప్పుడు తనేం చెయ్యాలి? ఏవో ఇలాంటివే సమాధానం ఆలోచించేందుకు కూడా అవకాశమివ్వక వెంటవెంటనే వచ్చే ప్రశ్నల తండోపతండం ఉక్కిరిబిక్కిరి చేస్తూంది.

ట్రంకుమీద వెండి సామగ్రి, మూట కంతల్లోంచి నవ్వుతూ పేరిగాడిని ఆహ్వానిస్తున్నట్టున్నది. పేరిగాడు అటువైపు నడవటానికి ఒక్క నిముషంకూడా పట్టలేదు. మూటను చంకబెట్టాడు. నిస్సహాయంగా నున్న ట్రంకును చేత్తో పట్టుకొన్నాడు. బరువుగా, జాలిగా మూలిగింది పెట్టె. ఉలిక్కిపడి నాల్గువైపులా అనుమానమైన నేత్రాలతో గది అంతా కలియజూచాడు. గురవాయి తల లోపలికి లాక్కున్నాడు. తృప్తితో మెల్లగా బైటకు పేరిగాడు సాగాడు. వాడి మొల్లో చురకత్తి భయంకరంగా వ్రేలాడుతోంది. రెండు చేతులలా దొంగిలించిన లక్ష్మిని అదుపులో పెట్టే కార్యక్రమంలో మునిగి తేలుతున్నాయి. ఎవరూ సాయం వచ్చినట్టు లేదు.

గుమ్మం సమీపించబోతున్నాడు తొందరగా అడుగులేసుకుంటూ.

ఇక తన పనేమిటి? తనేచే చేతులారా తన యజమాని లక్ష్మిని పేరిగాడి చేతుల్లో ధారపోశాననే అవమానంతో ప్రాణం గుంజుకుపోతూంది గురవాయికి. తనను కాకుండాపోయింది సరే; తన ఆసామీ ఇల్లు గుల్లైపోతోంటే తాను చూస్తూ ఊరుకుంటాడా? అది సబబైన పద్ధతేనా? తన కళ్ళముందు అంతపనీ జరగనిస్తాడా? తనకు ఆశ్రయం దొరకనప్పుడు దోవ చూపించిన కరణంగారికి సర్వనాశనం జరుగుతోంది. ఆలస్యంవల్ల ప్రయోజనం లేదు. తన పౌరుషానికి ఇదే నిజమైన పరీక్ష, అది ఇప్పుడే రుజువుకావాలి! పేరిగాడే కాదు యముడైనా సరే అటకాయించాల్సిందే. పేరిగాడు గుమ్మం దాటబోతున్నాడు, గురవాయి బయటికొచ్చి త్వరత్వరగా నిశ్శబ్దంగా నడిచి పేరిగాడి రెండుబుజాల, క్రిందుగా చేతులు పోనిచ్చి వాటేసుకొన్నాడు. మొల్లో చురకత్తి లాగేశాడు. గదిలోకి విసిరి పారేశాడు. "దొంగలు, దొంగలు" అని బిగ్గరగా అరిచాడు.

చెవిలో మారుమ్రోగిన ఆ అరుపుకి, గుఱ్ఱుపెట్టి నిద్రపోతున్న భార్యాభర్తలిద్దరూ, పిడుగు పడినట్టదిరిపోయి లేచారే కాని, దిమ్మరతిరిగినై వారి మనస్సులు. 'ఆఁ, ఆఁ, ఆఁ' అని బిగ్గరగా ఎలుగురాజని గొంతుతో పొలికేక వేయటం తప్ప వారికి మరొక పనే తోచలేదు. కొంచెం కంగారు తగ్గింతర్వాత ముందుసావడిలో ఇద్దరు వ్యక్తులు పెనగులాడుతున్నట్లు అస్పష్టంగా కనిపించింది. కాని ముందుకు పోవటానికి సాహసం రావటం లేదు కరణంగారికి. భార్య ఏడుస్తూ కావలించుకొని వదలటం లేదు. గురవాయి ఇంతలో రొప్పుతూ "దొరా, తొందరగా తలుపుతీసి కేకవెయ్యండి" అన్నాడు. అప్పటికే వాకిట్లో జనం మూగారు. కరణంగారు తలుపు తీసేటప్పటికి లోపల ప్రవేశించారు. పెనగులాడుతున్న ఇద్దర్నీ విడతీసి పేరిగాడి కాలు సేతులు బంధించారు. గ్రామమున్సబుగారింటికి ఈడ్చుకెళ్ళి ఆయనకు అప్పగించారు.

"భళే. గజదొంగను పట్టిన నీ తెలివి తేటల్ని మెచ్చుకోవాలిరా గురవా! గజదొంగల్ని మించిన దొంగవై ఉండాల నీవు" అన్నాడు నవ్వుతూ మున్సబు. ఆ చీకటిలో గురవాయి ఉలిక్కిపడడం ఎవ్వరూ గమనించ లేదు. అక్కడ చేరినవారంతా కరణంగారి అదృష్టమూ, గురవాయి తెలివితేటలూ, స్వామిభక్తీ, ఎన్నిసార్లో తప్పించుకు పోయిన పేరిగాడి దురదృష్టమునూ గురించి చెప్పుకున్నారు.

పేరిగాడికి అభిమానం ముంచుకు వచ్చి తల వాగిపోయింది. ఇంతకూ ఆతని మనసులో సందేహాలు నివర్తి అయ్యే సూచన అతనికి తోచనే లేదు. తను వచ్చేటప్పటికే ఉన్న కన్నం ఎవరు వేశారు? ఎవరో అనుభవంలేని దొంగ జొరబడాలనితీసి, యేదో చప్పుడయేటప్పటికి పారిపోయుంటాడని ధైర్యంతో అహంభావంతో లోపలికి ప్రవేశించాడు. గురవాయి తన్నెలా పసిబట్టాడు? గదిలోంచి వచ్చినవాడు గదిలో ఎప్పుడు దూరాడు? తన తృప్తికోసం ఏవో సమాధానాలు చెప్పుకొంటూ కచేరి సావడి గది బందిఖానాలో కూచున్నాడు పేరిగాడు.

కరణం, గురవాయీ ఇంటిదారి పట్టారు.

"కష్టకాలంలో నా కొంప రక్షించావురా" అన్నాడు కరణంగారు.

"మీ దాసులం కాదూ బాబయ్యా."

"నీ మేలు మరిచిపోలేనురా! ఇదిగో ఇప్పటికి ఈ ఐదు రూపాయలు తీసికెళ్ళి వాడుకో" అన్నాడు నోటు చేతులో పెడుతూ.

"అలా కాదు దొరా! తిండికి మాడి ఛస్తుండా! ఈ నెలతోటే కోతల్లోపడతా. ఒక అంకెం గింజ లిప్పించు దొరా. కోతల్లో పనిలోకి వస్తా"

"రేపుదయం రా అలాగే చూద్దాం. ముందివి తీసుకెళ్లు" అని చేతిలో పెట్టాడు. హృదయంలో పొంగి వచ్చే పశ్చాత్తాపంతో కళ్ళనిండా నీరు క్రమ్మింది గురవాయికి. పేరిగాడైతే తనకు యింతేనా...?

"సరేలే దొరా" అంటూ గుడిసె దారి పట్టాడు గురవాయి.